జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 17-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 166 పేజీలు: 8 వెల: రూ.7

## జిల్లా పోలీసు శాఖలో.. బదిలీల..
# జాబితా రెడీ



శ్రీకాకుళం క్రైం, నవంబర్ 16(వార్త): జిల్లా పోలీసు శాఖలో బదిలీలకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఎన్నాళ్ల నుంచో పాతుకుపోయిన వారిని బదిలీ చేసేందుకు జిల్లా పోలీస్‌బాస్ సంసిద్ధమయ్యారు. ఏయే స్టేషన్లలో ఎవరెవరు పాతుకుపోయారు, ఎన్నేళ్ల నుంచి సర్వీసు చేస్తున్నారు, వారిపై ఉన్న రిమార్కులు, ఫిర్యాదులు ఉన్నాయా తదితర పూర్తి వివరాలతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో పోలీస్‌స్టేషన్ల వారీగా జాబితాను తెప్పించుకున్నట్టు సమాచారం. త్వరలో ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను బదిలీ చేసే అవకాశం ఉంది. అలాగే శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనంగా ఎంతమంది సిబ్బంది ఉన్నారు, సీ నెంబరుపై ఎవరెవరు జిల్లా కేంద్రంలో పనిచేస్తున్నారు అన్న దానిపై కూడా ఆరా తీసినట్టు సమాచారం. దీంతో కొందరు జిల్లా పోలీసు అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తమను కాపాడాలని కోరుతూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే యువ ఐపీఎస్ అధికారి తీరును తెలిసిన కొందరు అధికారులు తామేం చేయలేమని, ఏమైనా ఉంటే బాస్ వద్దే

* పూర్తిస్థాయిలో జాబితాలను తెప్పించుకున్న జిల్లా బాస్ * ముగ్గురు డీసీఆర్‌బీ హెచ్‌సీలకు బదిలీ
* త్వరలో మరికొందరికి స్థానచలనం * ఎవరికి ఎక్కడ వేస్తారోనని కొందరిలో ఆందోళన
* జిల్లా పోలీసు అధికారుల చుట్టూ పలువురు ప్రదక్షిణలు

చెప్పుకోవాలని తిప్పిపంపిస్తున్నారన్న గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన పోలీసులకు దడ పట్టుకుంది. మరికొందరైతే తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ)లో పనిచేస్తున్న ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లకు బదిలీ అయింది. ఉమెన్ హెడ్‌కానిస్టేబుల్స్ సోమేశ్వరమ్మ (నరసన్నపేట), పోలయ్య (కాశీబుగ్గ), రామకృష్ణ (టెక్కలి) బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఆర్‌బీలో పనిచేస్తున్న మరికొందరికి కూడా బదిలీ అయ్యే అవకాశం ఉందని ఆ శాఖలోని కొందరు అధికారులు చెబుతున్నారు.

# విధి.. కాటేసింది!



* పౌర్ణమి రోజున బావిలో పడిన పాము * నీటిని తోడే క్రమంలో అందులోకి దిగిన మామ, మేనల్లుడు * ఆక్సిజన్ అందకా ఇద్దరూ మృతి * కనిమెట్టలో విషాద ఛాయలు * కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



శ్రీకాకుళం క్రైం/పొందూరు, నవంబరు 16 (వార్త): కనిమెట్టలో విషాద ఘటన చోటుచేసుకుంది. మామామేనళ్ల పాలిట ఆ బావి మృత్యుకుహరంగా మారింది. బావిలో పడిన పామును, నీటిని తోడేందుకు ఉపయోగించిన ఇంజిన్‌ను తీయబోయి చివరకు వారిద్దరూ ప్రాణాలు పోగొట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి మధుసూదనరావు (56), కింతలి ఢిల్లేశ్వరరావులు శనివారం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. మధుసూదనరావు ఇంట్లోకి శుక్రవారం రాత్రి ఓ పాము వచ్చింది. దానిని తరిమిందుకు ప్రయత్నించగా, ఇంటి ముందు ఉన్న నందల బావిలో పడిపోయింది. దీంతో శనివారం ఉదయం మధుసూదనరావు, ఆయన మేనల్లుడు ఢిల్లేశ్వరరావులు ఆ పామును బయటకు తీసే క్రమంలో బావిలో ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్‌తో తోడుతుండగా అది కూడా బావిలోకి జారిపోయింది. మధుసూదనరావు బావిలో దిగాడు. ఎంతసేపటికి కూడా ఆయన రాకపోవడంతో ఢిల్లేశ్వరరావు కూడా బావిలో దిగాడు. వీరిద్దరూ బావి నుంచి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురై పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వీరిద్దరి మృతదేహాలను బయటకు తీశారు. బావి మొత్తం ఆయిల్ కావడం, ఆక్సిజన్ అందకపోవడంతో వీరు మృతి చెందివుంటారని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మధుసూధనరావు, ఐటిఐ పూర్తిచేసుకుని ఉద్యోగ వేటలో ఉన్న ఢిల్లేశ్వరరావుల కుటుంబాలలో విషాదంనెలకొంది. మధుసూధనరావుకు భార్య సరస్వతి, కుమారుడు జగదీశ్వరరావు, వివాహమైన కుమార్తె తిరుమల ఉన్నారు. ఉద్యోగం చేసి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకునే ఢిల్లీశ్వరరావు మృతితో తల్లిదండ్రులు రాజేశ్వరి, చౌదరి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కన్నకొడుకు కానరాకుండా పోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు.

## బ్యాంకుల వద్ద..
# భద్రత పెంచండి

* ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి * సైబర్ నేరాల నివారణలో పోలీసులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలి * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి





శ్రీకాకుళం, నవంబర్ 16(వార్త): బ్యాంకు సముదాయాలు, బ్యాంకులు, నగదు లావదేవీలు జరిగే (ఎటిఎం) కేంద్రాలు వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంకు అధికారులు, కో ఆర్డినేటర్‌లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. బ్యాంకు, ఎటిఎం గార్డులు, క్యాష్ ఏజెన్సీల వ్యక్తిగత వివరాలను ముందస్తుగా సేకరించి, వారి ఆదరైజేషన్, లైసెన్స్, గన్ లైసెన్స్ ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి బ్యాంకు ప్రవేశ ద్వారం దగ్గర నియమించిన గార్డు అప్రమత్తంగా ఉండాలని, ఆయనకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించేటట్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎటిఎం కేంద్రాల వద్ద 24 గంటలు సెక్యూరిటీ నిర్వహించేలా, సీసీ కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి బ్యాంకు ఎటిఎం కేంద్రాలు సీసీ కెమెరాలు జిల్లా కేంద్రంగా ఉన్న పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. వ్యక్తిగత, గోల్డ్ తదితర రుణాలు మంజూరు చేసినప్పుడు రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అకౌంట్ ఓపెన్ చేసే సమయంలో కస్టమర్ల వివరాలను సమగ్రంగా తీసుకోని వాటిని వెరిఫై చేయాలని, బ్యాంక్ అకౌంట్ లో ఏమైనా అనుమానాస్పద నగదు బదిలీలు జరిగిన వెంటనే వినియోగదారులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. బ్యాంకు, ఎటిఎం కేంద్రాలు ఎదురుగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రజలు సైబర్ మోసాలకు గురి కాకుండా ఇరు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు గోల్డెన్ అవర్ లో బ్యాంక్ అధికారులు సత్వరమే స్పందించి సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా పోలీస్ వారికి సహకరించాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు ఏవరైనా ఆన్ లైన్ మోసాల బారిన పడి బ్యాంకులకు వచ్చినట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, వెబ్ సైట్ www. cybercrime.gov.in గురించి అవగాహన కల్పించి,ఫిర్యాదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ వివేకానంద్, కాశీబుగ్గ డీఎస్పీ అప్పారావు, ఉమెన్స్ పోలీసు స్టేషన్ డీఎస్పీ రాజశేఖర్, డిపిటిసి డీఎస్పీ ప్రసాదరావు, ఎస్బి సిఐ ఇమాన్యువల్ రాజు,శ్రీకాకుళం గ్రామీణ, పట్టణ సిఐలు పైడిపు నాయడు, ఈశ్వరరావు ఆమదాలవలస సిఐ సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, జిల్లాల్లో ఉన్న పలు బ్యాంకు అధికారులు, కో ఆర్డినేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గ్రంథాలయ వ్యవస్థాపకులకు ఘన నివాళి



**జలుమూరు, నవంబర్ 16(వార్త):** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సారవకోటలోని శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణంకు నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయ అధికారి సాయమ్మ మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, హిందీ ఉపాధ్యాయులు అప్పారావు, ఫిజిక్స్ ఉపాధ్యాయులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాపై అప్రమత్తం



కాశీబుగ్గ, నవంబర్ 16(వార్త): సోషల్ మీడియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత ఉపన్యాసకులు, పలాస లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్‌వై దొర పిలుపునిచ్చారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక విద్యా వాహిణి కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'సోషల్ మీడియా -పరిణామాలు' అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు సీహెచ్ జగదీష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో దొర మాట్లాడుతూ కొన్నేళ్ల వరకు మీడియా కొద్దిమంది చేతుల్లో ఉండేదని, నేడు ప్రతి వ్యక్తి చేతిలో ఉందన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా సాధనాలతో మన ఆలోచనలను, అభిరుచులను, ప్రత్యేక కళలను ప్రపంచానికి చాటి చెప్పి, ప్రజల ఆదరణతో ఉన్నత స్థానంలో నిలబడేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేకుండా అరచేతిలోని స్మార్ట్‌ఫోన్‌తోనే సాధ్యపడుతుందన్నారు. కాలయాపన లేకుండా సోషల్‌మీడియా ద్వారా అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పొందగలుగుతున్నామన్నారు. అయితే యువత ఎక్కువ కాలం సోషల్ మీడియాతోనే కాలం గడుపుతూ కోరి కష్టాలు తెచ్చుకుంటున్న విషాద సంఘటనలు కూడా గమనించాలని కోరారు. సోషల్‌మీడియా ఫలితంగా ప్రధానంగా మానవ సంబంధాలు, మానవతా విలువలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువత సోషల్ మీడియా మోజులో పడి అనేక యాప్‌లు, రమ్మీ వంటి క్రీడలకు ఆకర్షితులై వెళ్లి బంగారుభవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్‌మీడియా పవర్ తెలిస్తే అది మనిషికి వజ్రాయుధంలా ఉపయోగపడుతుందని, తప్పుడు మార్గంలో వెళ్తే అది మనిషి వినాశనానికి దారితీస్తుందని హెచ్చరించారు. అంతకుముందు రంగం ప్రజా సాంస్కృతిక వేదిక కళాకారులు హేమసుదన్, బాలాజీ విలేఖరుల ప్రాముఖ్యతను వివరిస్తూ అనేక పాటలు ఆలపించారు. కార్యక్రమంలో పలాస ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకుపల్లి నేతాజీ, కార్యదర్శి సంపతిరావు జయంత్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ రమణ, కొంచాడ రవిశంకర్, నాగరాజు, మేఘన, పల్లి కృష్ణ, కిశోర్, గణేష్, అంబికా ప్రసాద్, కళాశాల డైరెక్టర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**కాశీబుగ్గ, నవంబర్ 16 (వార్త):** శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు చాపర సుందర్ లాల్ కోరారు.

శనివారం ఆయన సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభ లను విజయవంతం చేయాలని కరప త్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమన్నారు. యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావజాలం, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పెంపొందించడానికి అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధి, యువజన హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. అందరికీ విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. భూమికోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం రక్తాన్ని ధారపోసి ఎన్నో సమరాలు సాగించిందని, రైతాంగ సాయుధ పోరాటానికి, అకుంఠిత త్యాగాలకు నెలవైన శ్రీకాకుళంలో జరుగుతున్న మహాసభలను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు దేవరావు, కొన్న శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు చాపర వేణుగోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, పలాస నాయకులు వెంకటరావు, సుందరరావు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే హైవోల్టేజ్ వైర్‌ను తాకడంతో..
## ఒకరికి గాయాలు



**సోంపేట, నవంబర్ 16(వార్త):** సోంపేట మండలం బారువ రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఓ మతిస్థిమితం లేని వ్యక్తి..ఆగి ఉన్న ఓ గూడ్స్ రైలు పైకి ఎక్కి హైవోల్టేజీ విద్యుత్ తీగను పట్టుకోవడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. సహాయం చేసేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నప్పటికీ.. ఆయన స్థానికులపై దాడి చేయడంతో వారు భయాందోళన చెందారు. అనంతరం రైల్వే సిబ్బంది 108కు సమాచారం అందించగా, ఆ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, ఆయనకు చికిత్స చేయబోగా వైద్య పరికరాలను ధ్వంసం చేశాడు.

# ప్లాస్టిక్ నివారణ ప్రజల బాధ్యత

**కాశీబుగ్గ, నవంబర్ 16 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గ్రీన్ ఆర్మీ, పలాస యూత్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం ప్లాస్టిక్ వాడకం నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి సప్ప నవీన్ కుమార్ మాట్లాడుతూ పలాస జీడిపిక్క ఔన్నత్యాన్ని, చిహ్నాన్ని తెలియజేసేలా బ్యానర్స్‌గానీ, ఫ్లెక్సీలు గానీ ఎక్కడ పడితే అక్కడ ప్రదర్శించవద్దని కోరారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి క్లీన్ పలాస దిశగా యువత, పుర ప్రజలు చేయి..చేయి కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఎస్.ఉమాశంకర్, శానిటరీ సూపర్‌వైజర్ సోమేశ్, పలాస వాసి దిలీప్, శంకర్, సెక్రటరీ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.






## భక్తులతో కిటకిటలాడిన శ్రీముఖలింగం

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** శ్రీముఖలింగంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. పెద్ద ఎత్తున క్యూ లైన్లో స్వామి దర్శనం కోసం బారులు తీరారు. స్వామి దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో ప్రభాకర్ రావు తెలిపారు. మూడో సోమవారం మరింత రద్దీ ఉండే అవకాశం ఉందన్నారు.

## ఆడపిల్లలను రక్షిద్దాం..చదవనిద్దాం!



**జలుమూరు, నవంబర్ 16(వార్త):** ఆడపిల్లలను రక్షిద్దాం, చదవనిద్దామని హెచ్ఎం ఉంగటి సూర్యనారాయణ అన్నారు. జలుమూరు మండలం లింగాలవలస జెడ్పీ హైస్కూలు సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లలను చదివించడంతో పాటు, వారి స్వీయ రక్షణకై విద్యార్థినులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణమూర్తి, విశ్వనాథం, దమయంతి కుమారి పాల్గొన్నారు.

## భూ హక్కు పత్రాల అందజేత



**జలుమూరు, నవంబర్ 16(వార్త):** సమగ్ర భూ సర్వేలో భాగంగా పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో భూహక్కు పత్రాలను రైతులకు అందజేశామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. నరసన్నపేట మండలం బసివలస రెవెన్యూ పంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ పత్రాల్లో వచ్చిన పేర్లు, విస్తీర్ణం తదితర కొన్ని తప్పులను సరి చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** గ్రామ పంచాయతీల్లో వనరుల మూలంగా ఆదాయాలను పెంచే అవకాశాలు ఉన్నాయని ఎంపీపీ అరంగి మురళీధర్ తెలిపారు. శనివారం ఆయన నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఆర్‌పీ లోకనాథం మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావు, జడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంఈవో

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియలో ఇబ్బందులను అధిగమించేందుకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. శనివారం ఆయన చల్లవానిపేటలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల డేట్ ఆఫ్ బర్త్ సరి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





## పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** జలుమూరులోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం మెండ రామారావు ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలను చేపట్టారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. కొత్త విషయాలను తెలుసుకునేందుకు గ్రంథాలయాల్లో పలు పుస్తకాలు అందుబాటులో ఉంటాయని విద్యార్థులకు వివరించారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



జలుమూరు, నవంబర్ 16(వార్త): రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. శనివారం ఆయన దోమనాపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన సర్వేలో కొన్ని పొరపాట్లు ఉన్నట్లుగా రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వాటిని సరి చేసేందుకే నేడు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో, గ్రామ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సమర్థుడికే కార్పొరేషన్ డైరెక్టర్ పదవి



**మందస, నవంబర్ 16(వార్త):** తెలుగుదేశం పార్టీ వీరవిధేయునిగా ఉంటూ, పార్టీకి ఎన్నో సేవలందించిన భావన దుర్యోధనను తెలుగుదేశం పార్టీ గుర్తించిందని పలువురు వక్తలు అన్నారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఆయనను శనివారం మందసలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. టీడీపీ అధ్యక్షునిగా దుర్యోధన సేవలను కొనియాడారు. దుర్యోధన మాట్లాడుతూ ఈ పదవితో మరింత బాధ్యత తనపై పడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గువ్వాడ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు గార కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, బూరగాపు శంకరరావు, తెల్లి హరికృష్ణ. బి.అప్పన్న, మామిడి చిరంజీవి, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ నేతలకు నివాళులు

**మందస, నవంబర్ 16(వార్త):** గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నేతలైన ఎస్ఆర్ రంగనాథ్, అయ్యంకి వెంకటరమణకు మందసలోని శాఖా గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నివాళులర్పించారు. లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో రంగనాథ్, వెంకటరమణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పొత్తులూరు నాగభూషణ్‌రావును స్మరించారు. వారి చిత్రపటాలకు పీఈటీ ఎం.ధర్మారావు, గ్రంథాలయ పాఠకులు బి.హరిబంధు, వాసుదేవు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి



**పోలాకి, నవంబర్ 16(వార్త):** చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని నరసన్నపేట మునసబ్ కోర్టు న్యాయధికారిని సీహెచ్ హరి ప్రియ అన్నారు. శనివారం పోలాకి మండల పరిషత్ సమావేశ మందిరంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా ఆమె మహిళలతో సమావేశమయ్యారు. రకరకాల తగాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని అటువంటి వారు సరైన న్యాయంకోసం చూస్తుంటారన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చున్నారు. సమయం, డబ్బు ఆరోగ్యం ఆదా అవుతుందన్నారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో చట్టాలు, లైంగిక, గృహ హింస, వరకట్న వేధింపులు వంటి సెక్షన్ల గుర్చి వివరించారు. కార్యక్రమంలో పరిషత్ అధికారి జి.రవికుమార్, ఎస్ఐ రంజిత్‌కుమార్, అడ్వకేట్ జామి కామేశ్వరరావు, లక్ష్మి, పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ మాట్లాడారు. జిల్లా ఉచిత న్యాయ సలహాదారులు పి.సౌజన్య, వేమూరి హరిప్రియ పలు అంశాలపై వివరించారు. అనంతరం చీడివలస, రేగుపాడు, పోలాకి సీఎఫ్‌లు తమ అనుభవాలను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గొండు సత్యనారాయణ, పాగోటి గణేష్, ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

# సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



**కాశీబుగ్గ, నవంబర్ 16 (వార్త):** సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చర్యలు చేపట్టాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ అధికారులు, పోలీసులు నిర్ణయించారు. జంట పట్టణాల్లోని ట్రాఫిక్ నియంత్రణకు కార్యాచరణ రూపకల్పనపై పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు సమావేశమయ్యారు. ఆక్రమణల తొలగింపు, పాత బస్టాండ్ స్థితిగతులు, కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ ప్రధాన కూడలి అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ దాడి మోహనరావు, పురపాలక సంఘం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి



**వంగర,నవంబర్ 16(వార్త):** రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీవో సత్యవాణి ఆదేశించారు.

శనివారం ఆమె చీపురు పల్లి ఆర్డీవో కార్యాలయంలో రాజాం నియోజకవర్గ నాలుగు మండలాల సివిల్ సప్లైస్, వ్యవసాయ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో సమా వేశమయ్యారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా గోనెసంచులు రైస్ మిల్లర్స్ ఏర్పాటు చేయాలని, వాహనాలకు రిజి స్ట్రేషన్ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా అధికారులు, మిల్లర్లపై వేటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వంగర, రేగిడి ఆమదాలవలస మండలాల డీటీ పిన్నింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ రామారావు పరామర్శ


**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు. కంచిలి మండలం బూరగాం గ్రామం వైస్సార్సీపీ సీనియర్ కార్యకర్త మద్దు కామమ్మ ఇటీవలి మృతి చెందారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి మరదలు ఇటీవల ఆకస్మికంగా మరణించారు. ఇచ్ఛాపురం వైఎస్సార్సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కాళ్ల దేవరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే.దీంతో ఆ కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన నరసన్నపేటలో 13 మండలాల మహిళా సంఘాల వీఏవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘ సభ్యులు ఎటువంటి వ్యాపారాలు ఏర్పాటు చేయాలన్న వాటికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ కొండలరావు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



# వైద్యులు కాని మీరెలా సమాధానమిస్తారు?

**-సర్వసభ్య సమావేశంలో హెచ్‌వోను నిలదీసిన పోలాకి మండల సభ్యులు**

**పోలాకి, నవంబర్ 16(వార్త):** వైద్యులు కాని మీరు.. వైద్యుల విషయాలు ఎలా వివరిస్తారని పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ హెచ్‌వో రవికుమార్‌ని ప్రశ్నించారు. శనివారం పోలాకి మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఆరోగ్య శాఖ తరపున హెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ వైద్యులు శస్త్రచికిత్సలో ఉన్నారని, మరొకరు శెలవులో ఉన్నారని వివరణ ఇచ్చినప్పటికీ సభ్యులు సంతృప్తిచెందలేదు. వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ రబీ పనులు చురుకుగా సాగుతున్నట్లు చెప్పారు. వాణిజ్య పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతంలో విత్తనాల పంపిణీకి పోలాకి ప్రధాన కేంద్రంగా ఉండేదని, ప్రస్తుతం లేదేమని పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలకు ఆయా కేంద్రాలు అందుబాటులో ఉంచాలనే ఏర్పాటుచేసినట్లు ఏవో బదులిచ్చారు. ఇప్పటివరకు ఏడు లక్షల 34వేలకు పైగా పని దినాలు కల్పించినట్లు ఏపీవో రమణారావు తెలిపారు. దండులక్ష్మీపురం క్షేత్ర సహాయకులు ఉద్యోగం ఖాళీగా ఉండడంతో సక్రమంగా ఉపాధి పనులు నిర్వహించడం లేదని సర్పంచ్ తెలిపారు. అనంతరం రహిమాన్‌పురం సర్పంచ్ సనపల సోమేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారికి ఉపాధి పనులు సక్రమంగా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తరేవు గుల్లవానిపేట, గుప్పెడుపేటల్లో ఉపాధి పనులు దూర ప్రాంతాల్లో జరుగుతున్నాయని, ఆయా గ్రామాల్లో పనులు నిర్వహించాలని ఆయా పంచాయతీల సర్పంచులు కోరారు. పంచాయతీరాజ్ ఏఈ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఏడు రకాల పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన గృహ నిర్మాణాలు తక్షణమే నిర్మించాలని చెప్పారు. గుల్లవానిపేట, కొత్తరేవు, జోగంపేట వంటి గ్రామాల్లో ఇళ్లు నిర్మించేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు రెవెన్యూ శాఖ ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. పశు వైద్యులు మాట్లాడుతూ ఊరూరు పశువైద్యం, మినీ గోకులాలు పథకం అమలులో ఉన్నట్లు తెలిపారు. సోలార్ విద్యుత్తు గూర్చి సభ్యులకు కోడూరు సచివాలయ కార్యదర్శి ముకుందరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిషత్ అధికారి గరిమెళ్ల రవికుమార్, వైస్ ఎంపీపీలు కోట అప్పారావు, కలగ తాతారావు, పరిషత్ కార్యాలయ వ్యవహారాల అధికారి సూర్యప్రకాశరావు, డీటీ రాజారెడ్డి, పలు పంచాయతీల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆ నలుగురు ట్రస్ట్‌కు జాతీయ తెలుగువెలుగు రత్న అవార్డు

**మందస, నవంబర్ 16(వార్త):** మందస మండల కేంద్రంగా పని చేస్తున్న ఆ నలుగురు ట్రస్ట్‌కు జాతీయ తెలుగు వెలుగు అవార్డు వరించింది. జిల్లాలోనే కాకుండా మరెన్నో ప్రాంతాల్లో సరైన సమయానికి రక్తదాతలను అందిస్తు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఈ ట్రస్ట్‌ను విశాఖ రత్న వారు 2024 అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయం ఆడిటోరియంలో జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావును ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో 17 మంది సమాజ సేవకులు, సినీ కళాకారులను గుర్తించి అవార్డులను అందించారు.

అందులో తమ ట్రస్ట్ ఉండడం ఎంతో ఆనందకరమని వ్యవస్థాపకుడు పిచ్చుక పాపారావు, పలువురు ట్రస్ట్ సభ్యులు తెలిపారు



# జిల్లా క్రికెట్ జట్టుకు ఇచ్ఛాపురం విద్యార్థుల ఎంపిక



**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్-12 క్రికెట్ జట్టు ఎంపికలు శనివారం జరిగాయి. ఇచ్ఛాపురం ఐసీసీ క్రికెట్ అకాడమీకి చెందిన సాలిన సాయి డిషోజ్ యాదవ్, సమిత్ గౌడ్, ధక్ష, ఓం ప్రకాష్, మహేష్ అనే ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ గోపి మీడియాతో తెలిపారు. జిల్లా జట్టులో స్థానం సంపాదించిన ఐదుగురు విద్యార్థులను తోటి క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వీరు జిల్లా జట్టులో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు.

# ఉర్లాం రైల్వేస్టేషన్ సమస్యలను పరిష్కరించండి

**జలుమూరు, నవంబర్ 16(వార్త):** ఉర్లాం రైల్వేస్టేషన్ సమస్యలపై చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ థాపా ఆధ్వర్యంలో శనివారం చర్చించారు. బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్, పూరీ-తిరుపతి రైలు నిలపాలని, రైల్వేస్టేషన్‌కి వచ్చే మార్గాలను మరమ్మతులు చేసి, పునరు ద్ధరించాలని పలువురు కోరారు. స్టేషన్ లో డ్రింకింగ్‌వాటర్, టాయిలెట్స్, బెంచ్‌లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ ఎండ శ్రీనివాసరావు, జిల్లా కిసాన్‌మోర్చా జన రల్ సెక్రటరీ చింతాడ మల్లేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాజ్‌కుమార్, స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు, ముద్దాడ ధర్మా రావు, మాజీ సైనికుడు గోవింద్, ఎస్. తేజారావు, బి.అర్జున్‌రావు, రైల్వే సిబ్బంది, స్టేషన్ పరిసరాల గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఆలయానికి ధారాపాత్ర వితరణ

**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఉపాలయానికి బరంపురం వాసినిమ్మన హేడంబరరావు(పెద్దబాబు)ధారా పాత్ర బహుకరించారు. ఈ పాత్ర విలువ సుమారు 4 లక్షల రూపాయలు ఉంటుంది. అర్చకులు మూర్తి.. పెద్దబాబు, విమల దంపతులతో పూజలు జరిపించారు.

## నేడు మందస మండల సమావేశం

**మందస, నవంబర్ 16(వార్త):** మందస మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహిస్తామని ఎంపీడీవో పైల సూర్యనారాయణ చెప్పారు. ఉదయం 10.30 గంటలకు మండలపరిషత్ సమావేశంలో జరుగుతుందని, ఆయా శాఖాధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

## పురుషోత్తపురం స్కూల్ సందర్శన



**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** పురుషోత్తపురం మోడల్ స్కూల్‌ను వైస్సార్సీపీ నాయకులు, సీడాప్ మాజీ చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాలలో వసతులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు సరి పడా నీటి వసతికి, అదనంగా మోటార్ అవసరమని ఉన్నతాధికారులకు తెలియ జేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ ఎస్సీ విభాగం కార్యదర్శి చల్ల దేవ రాజు, కౌన్సిలర్ జగన్ పాల్గొన్నారు.

## 25 నుంచి 108 సిబ్బంది సమ్మె



**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 25 నుంచి సమ్మె చేపడుతున్నట్లు 108 సిబ్బంది గోవిందరావు, తనూజ్, అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు డీటీ బలివాడ శ్రీవారికి వినతిపత్రం అందజేశారు. నిర్వహణ సంస్థలు మార్చడంతో ఉద్యోగులు పొందే సౌకర్యాలు నష్టపోతున్నారని వాపోయారు. గతంలో ఉద్యోగికి రూ.4వేలు అదనంగా ఇచ్చేవారని, దీనిని వైస్సార్సీపీ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు.

## పుస్తకం మంచి నేస్తం

**ఇచ్ఛాపురం, నవంబర్ 16(వార్త):** పుస్తకం మంచి నేస్తం అని రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పూర్ణచంద్ర బెహరా ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, గౌరీశంకర్ రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## చిదంబరేశ్వర ఆలయంలో గంగా హారతి

**ఇచ్ఛాపురం, నవంబర్ 16 (వార్త):** ఎం.తోటూరు చిదంబరేశ్వర ఆలయంలో శనివారం రాత్రి గంగా హారతి నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో ఉన్న మహా శివ విగ్రహం ఎదుట గంగా హారతిని ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు. గోదావరి, కృష్ణ, గంగానదిలో ఇచ్చే హారతి తరహాలో ఈ ప్రాంతంలో నిర్వహించడంతో భక్తులు పరవశులయ్యారు.

# బాలికలను చదివిద్దాం

*** మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ * కిశోరి వికాసంపై శిక్షణ**




**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 16(వార్త):** బాలికలు మానసికంగా బలోపేతం చేయాలని, వారు చదువుకునేలా ప్రోత్సహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ అడిటోరియంలో కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కిశోర బాలలందరికీ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సింగుపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.లిలీ మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముంది తరువాత ప్రతీ ఒక్కరు చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. ప్రతీ బాలిక రక్త హీనతకి గురికాకుండా బలమైన (న్యూట్రిషన్) ఆహారం తీసుకోవాలన్నారు. డీవీఈవో ఎస్.తవిటి నాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాల శాతం భారతదేశ సగటుకన్నా ఎక్కువగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్య వివాహాల నిర్మూలనకు కిశోరి వికాసం కార్యక్రమాన్ని పునః ప్రారంభించడం అభినందనీయమన్నారు. మహిళా మార్గదర్శి ఎన్.జిఓ శ్రీనివాస్, విద్యా ఫౌండేషన్ ఎన్జిఓ యు. ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, బాలికల రక్షణ కోసం అందరూ కలిసి పనిచేయాలన్నారు. గ్రామాల్లో, పాఠశాలలో బాలికల రక్షణపై ప్రచారం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ అఫ్ తైక్వాండో శ్రీను శిష్యులు జాస్మిన్, వంశీ బృందం బాలికలు ఆత్మ రక్షణకు సంబంధించిన మెలకువలు ప్రదర్శించారు. ఈ శిక్షణా తరగతులకు జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ డిసిపిఓ కె.వి.రమణ, ఎస్.నీరజ, టి.సుజాత, 30 మండలాల నుంచి మెడికల్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, లెక్చరర్స్, ఈఓపిఆర్‌డీలు, సిడిపిఓలు, సూపరైజర్లు పాల్గొన్నారు.

## నారా రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 16(వార్త):** ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరం అని, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ కాలం ప్రత్యక్ష రాజకీయాలలో ఉంటూ, 1994 నుంచి 99 వరకూ చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన ఎంతగానో రాణించారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణవార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ విషాద సమయంలో యావత్ తెలుగుదేశం కుటుంబం నారా వారి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. వ్యవసాయం, నాటక రంగం, రాజకీయ రంగాలతో పాటే క్రీడా రంగానికీ ఆయన సేవలు అందించారని గుర్తు చేశారు. అనారోగ్య కారణాల రీత్యా కొద్ది కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారని, ఇంతలోనే ఇలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందని తాము అనుకోలేదని పేర్కొంటూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అచ్చెన్నాయుడు సంతాప సందేశాన్ని విడుదల చేశారు.

## మంత్రి నాదెండ్లతో కోత భేటీ




**కాశీబుగ్గ, నవంబర్ 16 (వార్త):** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన పలాస నియోజకవర్గం నాయకుడు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణచందర్రావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలాస నియోజకవర్గంలో జనసేన బలోపేతంపై మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించారు.

## భారత స్వతంత్ర పోరాటానికి స్ఫూర్తి గ్రంథాలయ ఉద్యమమే



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 16(వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు ఐన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటాలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల లైబ్రేరియన్ ఇందువదన, విజయనగరం జిల్లా కేంద్రగ్రంథాలయ విశ్రాంత ఉపగ్రంథాలయ అధికారి డి.గోపాల్‌రావు జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటానికి స్ఫూర్తి గ్రంథాలయ ఉద్యమమే అని తెలిపారు. ఉద్యమ ఫలితం వల్లే ప్రస్తుతం ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఉన్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా విద్యార్థులు గ్రంథాలయాలపై ఇప్పటినుండే ఇష్టాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని తెలిపారు. అనంతరం శ్రీకాకుళంలో విద్యార్థుల జీవితంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సోడవరం ఈశ్వర్‌రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కర్ రాజా, సిబ్బంది ప్రత్యూష, రామ్మోహన్, కళ్యాణి, వరలక్ష్మి, రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శలు

*** కార్యకర్తల, నాయకుల కుటుంబాలను ఓదార్చిన ఎమ్మెల్సీ నర్తు రామారావు**

**ఇచ్ఛాపురం, నవంబర్16 (వార్త):** స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడు నర్తు రామారావు శనివారం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బిజీబిజీగా గడిపారు. నాలుగు రోజుల పాటు శాసనమండలి సమావేశంలో పాల్గొని, నియోజకవర్గానికి వచ్చిన ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కంచిలి మండలం బూరగాం గ్రామం వైయస్సార్సీపి సీనియర్ కార్యకర్త మడ్డు కామమ్మా ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆ కుటుంబానికి పరామర్శ చేశారు. కామమ్మ భర్త మాధవ రావును యోగక్షేమాలు అడిగి ధైర్యం తెలిపారు. అనంతరం ఇచ్ఛాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది స్వర్గీయ కాళ్ళ దేవరాజు కుటుంబానికి పరామర్శించారు. అనంతరం ఈదుపురం గ్రామానికి చేరుకొని ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప కుటుంబాన్ని సందర్శించారు. ఈ మధ్యనే ఎంపీపీ మరిది మృతి చెందారు. ఆ కుటుంబ సభ్యులను కలిసి తన సంతాపాన్ని తెలిపారు. అక్కడ నుంచి స్థానిక పంచాయతీలో ఒక కుటుంబానికి పరామర్శ చేశారు. ఈ కార్యక్రమాలలో అయా పంచాయతీల నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు శాసనమండలి సభ్యుని వెంట ఉన్నారు.

## వాటర్ క్యాన్‌లో పురుగులు



**ఇచ్ఛాపురం, నవంబర్16(వార్త):** ఇచ్ఛాపురంలో వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నీటిని ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. ఒక వాటర్ ప్లాంట్‌లో మూడు క్యాన్‌లలో పురుగులు వచ్చాయని నారాయణ నాయక్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. సదరు వాటర్‌ప్లాంట్ యజమానికి ఫోన్ చేస్తే ఇందులో వింతేముంది.. చెబితే మార్చేస్తాం కదా అని వ్యంగ్యంగా మాట్లాడడం గమనార్హం.

## టీచర్ ఆత్మహత్య

**కాశీబుగ్గ, నవంబర్ 16 (వార్త):** పలాస మండలం ఈదురాపల్లిలో మహిళా టీచర్ శాసనపురి నవ్య ఆత్మ హత్యకు పాల్పడింది. టీచర్ ఆత్మహత్యపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతురాలు నవ్య పలాస సమీపంలో సూది కొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. శవాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## అన్న మృతిపై అనుమానంతో ఫిర్యాదు

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 16 (వార్త):** తన అన్న మృతిపై అనుమానం ఉందని తమ్ముడు ఏకయ్య శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అధికారుల సమక్షంలో శనివారం గూడెం గ్రామానికి వెళ్లి పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. గూడేం గ్రామానికి చెందిన బొంతల కరువోడు(79) ఈ ఏడాది సెప్టెంబర్ 18న చెరువు వద్ద మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్థుల సమక్షంలో కరువోడు మృతదేహాన్ని పూడ్చివేశారు. కరువోడు భార్య ఐదేళ్ల కిందట మృతి చెందడంతో భార్య చెల్లెలి కుమార్తె వద్ద ఉండేవాడు. తమ్ముడు ఏకయ్య శ్యామపాలెంలో ఉంటున్నాడు. ఆస్తి విషయమై వారి మధ్య గొడవలు తరచూ జరిగేవని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే తన అన్న మృతిపై అనుమానం ఉందంటూ ఏకయ్య శుక్రవారం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో చెరువు వద్ద పూడ్చిన కరువోడు మృతదేహాన్ని వెలికితీసి తహశీల్దార్ గణపతిరావు సమక్షంలో రిమ్స్ వైద్యులు పోస్టుమార్టం చేశారు.



# అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

*** డీఎస్పీ వివేకానంద**




**శ్రీకాకుళం క్రైం, నవంబర్16(వార్త):** రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. ప్రపంచ రోడ్డు ప్రమాద బాధితుల జ్ఞాపక దినం సందర్భంగా స్థానిక రెడ్ క్రాస్ భవనంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డుపై వాహనాలు నడిపే వారు జాగ్రత్త వహించకపోతే అదే రోడ్డుపై ఎంతో జాగ్రత్తగా ప్రయాణించే వారికి సైతం ప్రమాదం జరుగుతుందని, ఎదుటవారి ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు వాహనాలు నడపాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగేటప్పుడు ప్రాణాలు కాపాడేందుకు అందుబాటులో ఉండే వ్యక్తులు ముందుకు రావాలన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని దేశాల్లో ట్రాఫిక్ కోసం పోలీస్ వ్యవస్థ లేకుండానే నడుస్తుందని, మన దేశంలో ట్రాఫిక్ కోసం ఎన్నో వ్యవస్థలున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ట్రాఫిక్ సిఐ వాన పల్లి నాగరాజు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం తప్పు అని, చిన్నపిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని ఆ తర్వాతే ప్రయాణం సాగించడం మంచిదన్నారు. టూటౌన్ సిఐ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ప్రమాదాలను యువత ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ నిక్కు అప్పన్న, కళ్యాణ చక్రవర్తి, చిన్మయ రావు, నరసింగ రావు, గుణాకరరావు, కొంక్యాన వేణుగోపాల్, పెంకి చైతన్య కుమార్, నంది ఉమాశంకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గత మూడు రోజులుగా ప్రథమ చికిత్సపై శిక్షణ పొందు తున్న 30 మంది యువతకు పోలీస్ అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546